మనిషి మారలేదు

ఆరోజు సీతకి రోజులా ఆరు గంటలకికాక ఐదుగంటకే తెల్లవారింది.

పెరట్లో ఆరుబయట మంచం వేసుకొని పడుకున్న సీతకి ఆ రోజు లేవగానే రోజూ మామూలుగా కనిపించే మల్లెచెట్టు, మందారచెట్టు, పారిజాతంచెట్టు అన్నీ సినిమాలోలాగా సంతోషం పట్టలేక ఊగిపోతున్నట్టనిపించాయి. రోజూ గోలగా అనిపించే పిచికల కాకుల గోల ఆరోజు కిలకిలారావాలుగా వినిపించాయి. రోజూ నీరసంగా నిర్లిప్తంగా లేవక తప్పదన్నట్టు లేచే సీత చెంగున మంచం దిగి లోపలికి నడిచింది.

కాఫీకుంపటి, బొగ్గుల డబ్బా, బిందెలు, గిన్నెలు, కూరలబుట్టా, బియ్యం డబ్బా, మాసిన వాయిల్ చీరలు, కుక్కి మంచంలో పడుకుని మూలిగే పక్షపాతం తల్లి—విసుగ్గా కనిపించే యీ దృశ్యాలేవీ సీతకి విసుగనిపించలేదు ఆరోజు.

చక చక కాఫీపని, వంటపని, తల్లికి స్నానం చేయించి భోజనం పెట్టడం, తన స్నానం, భోజనం అన్నీ పూర్తిచేసి తొమ్మిదిన్నరకల్లా ఆఫీసుకి బయలుదేరిపోయింది. ఏనాడూ పదిన్నరలోపల ఆఫీసుచేరని సీత ఆనాడు.

పది గంటలతరవాతే ఆరుగంటలయి పోతుందేమోనంత ఉత్సాహంతో గబ గబ అడుగులు వేసి బస్‌స్టాప్ చేరింది సీత.

ఆరుగంటలు! సాయంత్రం ఆరుగంటలు! సీత జీవితంలో ఆరోజు ఆరుగంటలకి ప్రాముఖ్యం వుంది.

"ఆరు గంటలకి గార్డెన్స్ దగ్గర మీకోసం చూస్తుంటాను.... వస్తారా, వస్తారుకదూ!" అన్న మూర్తి మాటలు తప్ప సీతకి రోడ్డుమీద కోలాహలం ఏం వినిపించడంలేదు.

సీతని గార్డెన్‌కు రమ్మని పిలిచాడు!

ఇన్నాళ్ళకి. ఇన్నేళ్ళకి ఆమెను ఓ స్త్రీగా గుర్తించి ఓ పురుషుడు మాట్లాడాడు, ఆహ్వానించాడు! ఆనందంతో సీతకి మతిపోయింది ఆరోజు.

పుట్టిన ముప్ఫైఏళ్ళకి సీత ఓ పురుషుడి దృష్టిని ఆకర్షించింది అంటే సామాన్యమైన సంగతి కాదు!

మగవాళ్ళని ఆకర్షించే ఏ అందమూ లేదు సీతకి. చామనచాయ రంగుతో ఐదడుగులు దాటని పొడుగుతో, ముందుకు తోసుకువచ్చిన పళ్ళతో భుజాలు దిగని జడతో, ఏ కళాకాంతీ లేని ముఖంతో వుండే సీతని ఏ మగాడూ వలచలేదంటే ఆశ్చర్య మక్కరలేదు.

సీత తండ్రి బ్రతికుండగా తల తాకట్టు పెట్టి అయినా ఓ మూడు నాలుగువేలు తెచ్చి సీత పెళ్ళిచేసి బరువు దించుకుందామని విశ్వ ప్రయత్నంచేశాడు అంత తక్కువ ధరకి సీతలాంటి ఆడపిల్ల మెడలో పుస్తె కట్టడానికి ఏ నాధుడూ కనపడకపోవటంతో, ఆ దిగులుతోనే ఆయన కన్ను మూశాడు. ఆ వున్న ఒక్క ఆధారం తెగిపోవడంతో, మెట్రిక్ చదువు ఆధారంతో ఆడపిల్లలు ముగ్గురిలో ఆఖరిదయిన సీత ఆ యింటిభారం చేపట్టక తప్పలేదు.

ఐదారేళ్ళనుంచి ఉద్యోగం చేస్తున్నా మగవాళ్ళ మధ్య రోజూ మసలుతున్నా సీత అనే అమ్మాయి వున్నట్టు ఏమగాడూ ఏనాడూగుర్తించ లేదు ఆఫీసులో! టైపిస్టు సుమతి, స్టెనో వాసంతితోనే అందరూ ఎందుకు మాట్లాడతారో, టీ,కాఫీలు వాళ్ళిద్దరికే తెచ్చి అందరూఎందుకు అందిస్తారో, వాళ్ళిద్దరి పని నేనంటే నేనని ఎందుకు పోటీలుపడి చేస్తారో, తనతో అందరూ ఎందుకు అలా వుండరో సీతకి చాలా రోజులకిగాని అర్థంగాలేదు. అర్థంఅయ్యాక ఉక్రోషం వచ్చింది. ఆ ఉక్రోషం ఎవరిమీద చూపాలో తెలి యక తనని తానే అసహ్యించుకోసాగింది.... ఆ అసహ్యం కొన్నాళ్ళకి నిర్లిప్తత, ఉదాసీనతగా మారింది. ఈ గానుగెద్దు జీవితం ఎంత రోతపుట్టించినా, బ్రతకాలనే యిచ్ఛలేకపోయినా, చావడం ఎలాగో తెలియని సీత అలాగే రోజులు నెట్టు కొస్తూంది.

సీతకి ముప్పైనిండి యేడాది దాటింది. తనకింక పెళ్ళవుతుందని, తన జీవితచరిత్రలో మొగుడు, పిల్లలు, సంసారం అన్న చాప్టర్లు ఎన్నటికీ నిండవని సీతకి ధృవపడిపోయింది.

అలాంటి సీత చీకటి జీవితానికి ఓ చిన్న వెలుగురేఖ కనపడింది. ఆ రేఖ మూర్తి!

మూర్తి ఆ ఆఫీసుకి వచ్చి రెండు నెలల అవుతూంది. ఎవరు వస్తున్నారో ఎవరు వెళుతున్నారో సీతకి అక్కరలేని సంగతులు. ఎవరు వచ్చినా వెళ్ళినా సీతకి సంబంధించని సంగతులుగా సీతేకాక తక్కిన వాళ్ళుకూడా నిర్ణయించకంతో ఆ ఆఫీసుకి మూర్తి వచ్చిన సంగతి సీతకి చాలా రోజులకిగాని తెలియలేదు. ఓనాడు ఏదో కాగితం రిఫరెన్స్‌కోసం మూర్తివచ్చి మాట్లాడాక మూర్తి అన్న మనిషి ఆ ఆఫీసుకి వచ్చినట్టు తెల్సింది సీతకి. సీత దృష్టిలో ఏ ప్రాముఖ్యతా లేదు.

తర్వాత ఓ నెలకి గాబోలు బస్‌స్టాప్‌దగ్గర మూర్తి యధాలాపంగా పలకరించాడు. 'మీరు ఎక్కడండీ వుండడం' అంటూ మాట్లాడింది. నాలుగు మాటలే అయినా జవాబు చెప్పడానికి సీత తబ్బిబ్బు అయిపోయింది. బహుశా ఓ మగాడు తనతో మాట్లాడడం అదే మొదటిసారి. అవడంవల్ల! చెమట పట్టింది. మాట తడబడింది. ముఖంలోకి చూడకుండానే ఎలాగో చెప్పింది.

మరోసారి, "ఏమండీ, మీరేం మరీ అంత ముభావంగా వుంటారు. ఆఫీసులో ఎవరితోనూ మాట్లాడరేం!" అని మామూలుగా అడిగిన ఆ ప్రశ్నకి సీతకి దుఃఖంతో గొంతులో ఏదో అడ్డంపడింది. "నాతో ఎవరూ మాట్లాడరు! నేనేం చేసేది!" అంటూ ఆవేదన అంతా వెళ్ళబోసుకోవాలన్నంత....ఆప్తుడుగా మూర్తి ఆ క్షణాన కనబడ్డాడు. కాని ఆ మాట ఎలా చెప్పాలో తెలియక అదేదో తన స్వభావం అన్నంత తేలిగ్గా చిన్న నవ్వు నవ్వింది.

ఓ నాలుగైదుసార్లు మూర్తి ఏవేవో మామూలు మాటలు మాట్లాడాడు. సీతకి ఏదో చిన్న ఆశతోపాటు కాస్త ధైర్యంకూడా వచ్చింది. ఆఫీసులో రోజులో ఎప్పుడో ఒకప్పుడు మూర్తి పలకరించకపోతే తనే

చొరవచేసి, కలుగ చేసుకొని మాట్లాడేంత ధైర్యం వచ్చింది సీతకి. ఓనెల రోజులు గడిచేసరికి మూర్తి, సీత చనువుగా మాట్లాడుకునే స్టేజికి వచ్చారు.

మూర్తి కాఫీకి పిలిస్తే నిస్సంకోచంగా, నిరభ్యంతరంగా, సంతోష పూర్వకంగా వెళ్ళింది. తరువాత బస్‌స్టాండ్ వరకు జంటగా వెళ్ళేందుకు ఏ మాత్రం సందేహించలేదు సీత.

ఆఫీసులో గుసగుసలు, వెక్కిరింతలు, వేళాకోళాలు, అన్నిటినీ భరించి, నిర్లక్ష్యం చేయగలిగింది సీత.

మూర్తి ఉద్దేశం ఏమిటో సీతకి తెలియదు మూర్తి గురించిన వివ రాలు ఆరాతీసే ఓపిక, పట్టించుకునే స్థితిలో లేదు. కాని మూర్తి వంట రిగా ఓ గదిలో అద్దెకుంటున్నాడన్న విషయం మాత్రం సీతకి తెలుసు।

అందరూ హేళన చేస్తున్నా, వ్యంగ్యంగా విసుర్లు విసురుతున్నా లెక్క చేయకుండా తనతో మాట్లాడుతూనే వున్నాడంటే నిజంగానే తన మీద ఇంటరెస్టు వుందనడానికి ఇంతకన్న ఏం నిదర్శనం కావాలని నమ్మింది సీత. పొంగిపోయింది. ఎండి నేల రాలిపోతుందన్న తన జీవన లతకి లభ్యమయిన యీ కాస్త ఆలంబనాన్నీ దూరం చేసుకోకూడదని నిర్ణయించుకుంది సీత మనసులో।

సీత ఆరాటం అర్థం చేసుకోలేనంత అమాయకుడు కాడు మూర్తి. నవ్వుకున్నాడు మనసులో। ఏ మూలో కాస్త జాలికూడా తొంగిచూసింది.

ఆరుగంటలయింది। అంతకు అరగంట ముందుగానే సీత పబ్లిక్ గార్డెన్సు గేటుదగ్గర మూర్తికోసం ఆరాటంగా ఎదురుచూస్తూ నిల్చుంది. రావల్సిన దానికంటె ముందు వచ్చానని తెల్సినా క్షణక్షణానికి వాచి చూసు కుంటూ రోడ్డుమీదికి దృష్టి సారించి అశాంతిగా నిల్చుంది సీత।

ఆరు ఇరవైకి మూర్తి కనపడగానే హృదయం మీదనించి పెద్ద బరువు దిగినట్టు ఫీలయింది సీత. సంతోషంతో మొహం వెలిగింది.

"సారీ. కాస్త ఆలస్యం అయింది, చాలా సేపటినించి వెయిట్ చేస్తు న్నారా." అన్నాడు.

సీత అంతవరకు తనుపడ్డ బాధ మరిచి "లేదు.... లేదు నేనూ ఇప్పుడే వచ్చాను" అనేసింది.

"పదండి, లోపలికివెళ్ళి కూర్చుందాం."

నడుస్తూండగా "ఇలా పిల్చినందుకు మీరేం అనుకోలేదుగా!...." సీత మొహంలోకిచూస్తూ అన్నాడు మూర్తి.

సీత కళ్ళరెప్ప లార్పింది. తడబడుతూ నవ్వింది. "ఉహు........ లేదు....ఏమనుకోడానికి ఏముంది?"

"సీతగారూ!...." కూర్చున్న కాసేపటికి అన్నాడు మూర్తి.

"గారూ వదిలేయండి....సీతా అనండి చాలు...." సీత ధైర్యంగా తలెత్తిచూస్తూ చనువుగా అంది.

"సీతా!........" మొహంలో భావాలు వెతకడానికి ప్రయత్నిస్తూ అన్నాడు మూర్తి.

"ఊ...."

"సీతా....నువ్వు ఎప్పుడూ అంత ఉదాసీనంగా ఎందుకుంటావు?.... ఎన్ని రోజులబట్టో చూస్తున్నాను...."

ఉదాసీనత కాక ఆమె బ్రతుకులో ఆనందం ఎక్కడుంది? జవాబేం చెప్పలేకపోయింది సీత.

"సీతా, నిన్నుచూస్తే నాకు జాలి అనిపించింది చాలాసార్లు, ఆఫీసులో ఎవరూ నీతో మాట్లాడరేం?"

అంత ఆదరంగా అడుగుతూంటే సీత మనసులో ఆవేదవంతా విప్పి చెప్పుకోవాలన్నంత ఆవేశం వచ్చింది.

"నాలో ఏం వుందని అందరూ నాతో మాట్లాడుతారు? సుమతిలా అందం వుందా? వాసంతిలాంటి ఫిగర్, చలాకీతనం వుందా?...." ఆమె గొంతు వణికింది.

"అయితే, అందం లేనంత మాత్రాన మీరూ ఓ మనిషి గాదా, మీకూ ఓ మనస్సు వుండదంటారా?"

"వుందని ఎవరో మీలాంటి సహృదయులనుకుంటారు. కానీ అందరూ అలా అనుకోవద్దూ...." కృతజ్ఞతతో సీత కళ్ళు తడి అయ్యాయి.

తరువాత ఇద్దరూ కూర్చుని ఓ గంట మాట్లాడిన మాటలు సీత తల కెక్కలేదు. మూర్తికి తన అందంతో పనిలేదు. తనని ఓ మనిషిగా, ఓ స్త్రీగా మాత్రం గుర్తించాడు! మూర్తి అందగాడు కాదు! అందుకే అతనికి అందంమీద గురిలేదు. అందంలేని వారిమీద సానుభూతి వుంది!

మూర్తితో మాట్లాడిన ఆ గంటలో సీతలో క్రొత్త కోరికలు చిగిర్చాయి! ఏవేవో ఆశలు రేకెత్తాయి ఆమె మనసులో! యీ నాటికి తన జాతకం తిరుగుతుంది కాబోలు! మూర్తి సహృదయతమీద సీతకి ఎంతో నమ్మిక కలిగింది. మూర్తి, మనిషి అందానికికాక మనసుకి ప్రాధాన్యం ఇచ్చేట్టున్నాడు. అదే నిజమయితే తన బ్రతుక్కి ఓ అర్థం ఏర్పడుతుందన్న మాట! తనూ యీ నాటికి ఓ యింటికి యిల్లాలవుతుంది, ఓ పురుషుడి హృదయంలో స్థానం సంపాదించుకుంటుంది!....సీత ఆలోచనలు చాలా దూరం కళ్ళెంలేని గుర్రంలా పరిగెత్తాయి.

తర్వాత మూర్తి, సీతతో వంటరిగా చాలాసార్లు మాట్లాడాడు. ఎన్నోసార్లు పార్కులో కలుసుకున్నారు. మరెన్నోసార్లు సినిమాలకి వెళ్లారు. మూర్తి ఎప్పుడు ఎక్కడికి రమ్మన్నా సీత అభ్యంతరం చెప్పకపోగా ఆనందంగా ఆమోదించింది.

తన కలలు నిజమవబోతున్నాయని మురిసింది. తనని ఉద్ధరించడానికి దేవుడే మూర్తిగా దిగి వచ్చాడని సీత ప్రగాఢ విశ్వాసం.

రాత్రనక పగలనక మూర్తితో తిరిగే తిరుగుడు గురించి ఆఫీసులో ఇంటి దగ్గరా ఇరుగుపొరుగు అనుకునే, అనే మాటలు సీత లక్ష్య పెట్టలేదు. మంచంలో పడుండే తల్లిని మభ్యపెట్టడానికి అట్టే కష్టపడలేదు సీత.

రెండు నెలలు గడిచిపోయాయి. సీత, మూర్తి ఇద్దరూ చాలా సన్ని

హితులైనారు. కనీసం సీత అలా అనుకుంది. ఎన్నో సందర్భాలలో తన కెంతో చేరువగా వచ్చిన మూర్తిని అభ్యంతర పరచలేదు. అతనిమీద ఆమెకి పూర్తి నమ్మకం వుంది. అంత సన్నిహితులయ్యాక మూర్తి అడగబోయే మాటకోసం ఆత్రుతగా నిరీక్షించసాగింది సీత.

మూర్తి హృదయంపెట్టి తన్మయత్వంలోవున్న క్షణాలలో ఎన్నో సార్లు "ఇక్కడ నాకు కొంచెం చోటీయరూ!"అని సినిమాల్లోలాగ అడగా లనిపించినా నోటి చివరదాకా వచ్చిన మాటలని, సిగ్గు వెనక్కి లాగేసేది. అడగవలసింది మూర్తి కానీ తను కాదేమో! తొందరపడి తను తేలిపోతే మూర్తికి కోపం వస్తుందేమో! ఇంత సన్నిహితంగా వచ్చిన మూర్తి తను అడిగితే అపనమ్మకమా అని నొచ్చుకుంటాడేమో! అనుమానాలతో, జంకుతో, సిగ్గుతో రోజులు గడిపేస్తూంది సీత. మూర్తి అడగబోయే మాటకోసం ప్రతిరోజూ ఎదురు చూస్తూండగానే రోజులు దొర్లిపో సాగాయి.

ఎవరి మాటలు ఎంత లక్ష్యపెట్టకూడ దనుకున్నా, తల్లికి జవాబు చెప్పవలసిన స్థితి వచ్చింది సీతకి. మూర్తి సమక్షంలో మిగతా ప్రపంచాన్ని మరిచిపోయినా, లోకంతో నాకేమి అనుకున్నా........ ఒక్కర్తీ కూర్చుని ఆలోచించుకుంటే....ఇలా ఎన్నాళ్ళు అనే ప్రశ్న వచ్చేది సీతకి. నేనేం చేసినా నా యిష్టం అంటే ఈ దేశంలో, చుట్టూవున్న మనుష్యులు, సంఘం వూరుకోదు అన్న విషయం అర్థమవసాగింది సీతకి. ఇలా కాలయాపన మంచిది కాదనిపించసాగింది! మూర్తి నిశ్చింతగా ఊరుకున్నా అతన్ని త్వర పెట్టవలసిన అవసరం తనకుంది! చూచాయగానైనా తన మనోగత అభిప్రాయం అర్థం అయ్యేట్టు చెప్పాలి! మూర్తిమీద తనకెంత నమ్మకం వున్నా లోకం నమ్మాలి అతన్ని! సంఘంముందు దోషులవకూడదు తాము!

ఎన్నో రోజులు ఆలోచించి, సందేహించి, ఆఖరికి మర్నాడు అడగాలని సీత గట్టిగా నిర్ణయించుకుంది.

♦ ♦ ♦

సీత అరగంటనించి పార్కులో కూర్చుని మూర్తికోసం నిరీక్షిస్తూంది. నిన్ననే ఆఫీసులో చెప్పింది. ఆశ్చర్యంగా "ఎందుకు" అన్నాడు మూర్తి! "మీతో చాలా మాట్లాడాలి. ఒకటడగాలి!" అని ముసిముసినవ్వులతో అంది సీత. మూర్తి సీత కళ్ళల్లో భావం అర్థం చేసికోడానికి గుచ్చి గుచ్చి చూశాడు.

మూర్తి వస్తాడు. రాగానే ఎలా మొదలుపెట్టాలో, ఏమని అడగాలో, ఇప్పటికి ఓ వంద సార్లయినా రిహార్సల్స్ వేసుకుంది సీత.

కనుచీకటి పడుతూంది.... మూర్తి వస్తాడు.... వచ్చి కూర్చుంటాడు.

"ఏం సీతా, ఏమిటి సంగతి?" అంటాడు. తను యిటూ అటూ చూసి చప్పున అతని గుండెల్లో మొహం దాచుకుంటుంది. "నేనేం అడుగుతానో ఊహించలేదూ.... నాకేం కావాలో నీకు తెలియదా!"

"ఉహూ" మూర్తి చిలిపిగా నవ్వుతాడు.

"నీవు కావాలి.... శాశ్వతంగా నావాడవి కావాలి. నాకింతకంటే ఏం కావాలి. మూర్తీ నన్ను నీ దాన్ని చేసుకో నలుగురి సమక్షంలో" అంటూ సిగ్గువిడిచి చెప్పేస్తుంది....

"పిచ్చి సీతా! దానికింత సందేహం ఎందుకు, నేనే చెపుదామనుకుంటున్నాను ఇవాళో రేపో. అసలు నీకిలాంటి సందేహం ఎందుకురావాలి, ఆమాత్రం నామీద నమ్మకంలేదా...." అంటూ ప్రేమగా దగ్గరికి తీసుకుంటాడు.

"లేదు.... లేదు నీమీద నమ్మకం లేకకాదు.... కాని.... యీ పాడు లోకం ఒకటుందిగా...." నొచ్చుకుంటూ సంజాయిషీ యిస్తుంది.

"అవును.... నిజమే ఇన్నాళ్ళూ ఆ మాటే ఆలోచించలేదు నేను. నిన్ను బాధపెట్టానా సీతా! ఇదిగో రేపే వెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో మన పేర్లు రిజిష్టర్ చేయిస్తాను.... మళ్ళీ నెలనాటికి మనం భార్యాభర్తలం అయిపోతాం ఓ కే..., ఆర్ యూ సేటిస్ ఫైడ్ నౌ...,...," అంటూ చిలిపిగా

నవ్వుతాడు. సిగ్గుతో సీత మూర్తి గుండెల్లో మొహం దాచుకుంటుంది సర్వం మరిచి.

కళ్ళముందు పరుచుకున్న రంగుల కలని చెదరగొడ్తూ ప్రక్కనే ఎవరి ట్రాన్సిస్టర్‌లోంచో వినవస్తున్న తెలుగువార్తలు విని సీత ఉలిక్కిపడి చుట్టూ చూసింది.

ఏడు గంటలు! అప్పుడే ఏడయిందా? చుట్టూ పరుచుకున్న చీకటినీ, ఆ చీకటిని చీల్చే ప్రయత్నంలో వెలిగే ట్యూబ్ లైట్లనీ చూసి గాభరాపడింది సీత.

మూర్తి ఇంకా రాలేదు. ఆరుగంటలకి వస్తానని ఎందుకు రాలేదో! ఇవాళ ఆదివారం! ఏం పని వుంటుంది? వస్తుంటే ఎవరన్నా స్నేహితులు అడ్డు తగిలారేమో! వాళ్ళని వదుల్చుకుని వచ్చేసరికి ఆలస్యం అవుతుంది గాబోలు!

మూర్తి రాడేమో అన్న అనుమానం, భయం సీతకి ఏంత మాత్రం కలుగలేదు. సీత కళ్లు చీకటిని చీలుస్తూ కనపడినంతమేరా మూర్తి కోసం ఆరాటంగా వెతుకుతున్నాయి.

సెకన్లు నిమిషాలుగా, నిమిషాలు గంటలుగా మారుతున్నాయి. "ప్రేమ వేరు పెళ్ళి వేరు! ప్రేమించడం హాబీగానీ, పెళ్లాడ్డంకాదు! అవసరార్థం ఆడదాన్ని వాడుకోవడాన్ని ప్రేమ అనరు! మగవాళ్ళ ప్రేమకబుర్లు పెళ్ళికి దారితీయవు సుమా! పిచ్చి సీతా!" అంటూ, చూసిన సినిమాలల్లో, చదివిన కథలల్లో వంచించబడ్డ అమ్మాయిలందరూ సీతని చుట్టూ ముట్టి ఊపిరి ఆడనీయకుండా ఎలుగెత్తి ఘోషించారు. భయపెట్టారు! మూర్తి మీదవున్న నమ్మకంతో సీత అందరినీ బలవంతంగా దూరంగా నెట్టేసింది.

ఆరిపోతున్న ఆశాదీపాన్ని ఎగద్రోసుకుంటూ, తన మనసుని తనే మభ్యపెట్టుకుంటూ అలా స్థాణువులా కూర్చుంది సీత మూర్తి కోసం చూస్తూ.

ఎనిమిది గంటలయింది....పూరీ ఎక్స్‌ప్రెస్ పొగలు చిమ్ముతూ పరిగెడ్తూంది. ఎప్పుడెప్పుడు వెళ్ళి సుపుత్రుడిని చూస్తానా అన్న మూర్తి ఆరాటం రైలుకంటె వేగంగా పరుగెడ్తూంది.

ఎనిమిదిన్నర...."వేషము మారెను. భాషలు నేర్చెను, అయినా మనిషి మారలేదూ...." ట్రాన్సిస్టర్‌లోంచి వినిపిస్తున్న రికార్డు ఎక్కడో కలలో మాదిరి వినిపిస్తుంటే....ఏదో కల కరిగిపోయినట్లు లేచింది సీత తడబడ్తూ।....కాళ్ళు తేలిపోతుండగా ఎలాగోవెళ్ళి బైటవున్న ఓ రిక్షాలో కూలబడింది సీత। పాపం సీత!।

-(౦)-